క్లుప్తంగా

సన్మానం


గోపాల్‌ను సన్మానిస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గోపాల్‌ను రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ఎంపీపీ గిరిధర్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి భాస్కర్, జహీరాబాద్, మొగుడంపల్లి మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి అభినందన


నగదు బహుమతిని ప్రదానం చేస్తున్న ఎస్పీ రూపేశ్

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు కేసులను ఛేదించినందుకు గాను ఎస్పీ రూపేశ్ బుధవారం గుమ్మడిదల పోలీసులను అభినందించారు. ఈ సందర్భంగా సీఐ సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి, సిబ్బంది సికిందర్, వెంకటేశం, కిషోర్‌లకు నగదు బహుమతులను ప్రదానం చేశారు. ఇందుకు గాను పోలీస్ సిబ్బంది ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. 27పిటి

క్యాన్సర్‌పై అవగాహన


క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న స్వప్నిక రేహ ఫౌండేషన్ ప్రతినిధులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం స్వప్నిక రేహ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. క్యాన్సర్ వచ్చేందుకు కారణాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తదితర విషయాలను ఫౌండేషన్ ప్రతినిధి మహాలక్ష్మి విద్యార్థులకు వివరించారు. అనంతరం రోటరీ క్లబ్ ఆఫ్ హిమాయత్‌నగర్ ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధి ఆనంద్ పాఠశాల అవసరాలకు ఉపయోగపడే ప్రింటర్‌లను అందజేశారు. విద్యార్థులు పరీక్షలకు సిద్ధమయ్యేందుకు తీసుకోవాల్సిన అంశాలపై ఆయా సంస్థల ప్రతినిధులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మంగీలాల్, ఉపాధ్యాయులు రాజేశ్వరి, పైసా సత్యం పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు


పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్

నారాయణఖేడ్: నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్ అన్నారు. ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్‌లో బోరు బావుల రీడ్రిల్లింగ్ పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎండల తీవ్రత అధికంగా ఉందని, అందువల్ల ముందస్తుగానే నీటి ఎద్దడి నివారణకు అవసరమైన చర్యలను చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు కూడా నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సహకరించాలని సూచించారు. తాగునీటి సమస్యను అధిగమించడానికి ప్రజాప్రతినిధులతో కలిసి సమన్వయంతో పనిచేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వివేకానంద్, సవితహన్మండ్లు, నాయకులు శెట్టి శంకర్, చేతన్, బాలయ్య, లక్ష్మయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని మల్లేపల్లిలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో హనుమాన్ మందిరం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ మల్లేపల్లి చుట్టుపక్కల పరిశ్రమలు ఉండడంతో ప్రతిరోజు వందలాది మంది కార్మికులు ఈ రహదారి గుండా ప్రయాణిస్తూ ఉంటారని, వేసవిని దృష్టిలో ఉంచుకొని కార్మికులు ప్రయాణికులు ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రమాదాలకు నెలవు బైపాస్


జహీరాబాద్ బైపాస్ రోడ్డులోని అల్గోల్ చౌరస్తా

అల్గోల్ చౌరస్తా.. యమడేంజర్

- కానరాని స్పీడ్‌బ్రేకర్లు, స్టాపర్లు
- అండర్ బ్రిడ్జి నిర్మించాలని స్థానిక ప్రజల విజ్ఞప్తి
- పట్టించుకోని నేషనల్ అథారిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు

జహీరాబాద్ బైపాస్ రోడ్డులోని అల్గోల్ చౌరస్తా ప్రమాదాలకు స్పాట్‌గా మారింది. ప్రమాదాలను నియంత్రించేందుకు 65వ జాతీయ రహదారిపై ఆయా ప్రాంతాల్లోని చౌరస్తాల్లో అండర్ బ్రిడ్జిలను నిర్మించారు. కానీ.. జహీరాబాద్ వద్ద బైపాస్ రోడ్డులో అల్గోల్ చౌరస్తా వద్ద అండర్ బ్రిడ్జిని నిర్మించలేదు. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకొని ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోగా మరికొంతమంది తీవ్ర గాయాల పాలయ్యారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అండర్ బ్రిడ్జిని నిర్మించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునేనాథుడు కరువయ్యాడని స్థానిక ప్రజలు వాపోతున్నారు. – జహీరాబాద్ టౌన్

అండర్ బ్రిడ్జిని నిర్మించాలి



అల్గోల్ చౌరస్తా వద్ద బైపాస్ రోడ్డులో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ చౌరస్తా నిత్యం రద్దీగా ఉంటోంది. హైదరాబాద్ నుంచి ముంబాయి వైపు వాహనాలు వేగంగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో ప్రజలు రోడ్డు దాటుతున్న క్రమంలో ప్రాణాలను కోల్పోతున్నారు. జిల్లాలో నేషనల్ హైవే అథార్టీ అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఎవరికీ ఫిర్యాదు చేయాలో తెలియడంలేదు. ఉన్నతాధికారులు స్పందించి చౌరస్తా వద్ద అండర్ బ్రిడ్జిని నిర్మించాలి. – చందు, దిడ్గి గ్రామం

బ్లాక్‌స్పాట్‌గా గుర్తించినా చర్యలు శూన్యం

జహీరాబాద్ నుంచి అల్గోల్‌తో పాటు భరత్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని అల్గోల్ చౌరస్తా వద్ద రోడ్డును దాటుతున్నారు. ఈ క్రమంలో రహదారి దాటే సమయంలో వేగంగా వస్తున్న వాహనాలు ఢీకొని ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో జహీరాబాద్ సమీపంలోని అల్గోల్ చౌరస్తాను అధికారులు బ్లాక్ స్పాట్‌గా గుర్తించారు. ఏర్పాటు చేశారు. కానీ.. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు, ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ఫోర్‌లైన్ రోడ్డును నిర్మించినా.. తరచూ ప్రమాదాలు

ప్రయాణికులకు రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు ఫోర్‌లైన్ రోడ్డును నిర్మించినా ఫలితం లేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అల్గోల్ చౌరస్తాను బ్లాక్‌స్పాట్‌గా గుర్తించిన నేషనల్ హైవే అథారిటీ అధికారులు ప్రమాదాలను నివారించేందుకు కనీసం స్పీడ్‌బ్రేకర్లు, స్టాపర్లను ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్డు దాటాల్సిన పరిస్థితి నెలకొంది.

సందర్శనలకే నేతలు పరిమితం

ప్రమాదాలకు స్పాట్‌గా అల్గోల్‌లో చౌరస్తాను ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు జిల్లా ఉన్నతాధికారులు అనేకసార్లు సందర్శించిన సందర్భంలో చౌరస్తాలో అండర్ బ్రిడ్జిని నిర్మించాలని వారికి విన్నవించినా ఇప్పటివరకూ పట్టించుకోలేదని, దీంతో తమ గోడును ఎవరితో చెప్పుకోవాలని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా నేషనల్ హైవే అథారిటీ అధికారులు స్పందించి అల్గోల్ చౌరస్తా వద్ద బ్రిడ్జిని ఏర్పాటుచేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళా రైతులపై హింసను అరికట్టండి


మాట్లాడుతున్న ఆశాలత

సంగారెడ్డి టౌన్: మహిళా రైతులపై హింసను అరికట్టాలని మకాం జాతీయ నాయకురాలు ఆశాలత అన్నారు. జిల్లా సమాఖ్య భవనంలో మకాం సంస్థ ఆధ్వర్యంలో మహిళా రైతులతో కలిసి బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చొరవ తీసుకొని ఇందిరమ్మ పాలనలో మాదిరిగా ప్రతి కుటుంబానికి పశువులను ఇవ్వాలని కోరారు. భూమిలేని ప్రతి కుటుంబానికి రెండెకరాలను ఇవ్వాలన్నారు. మహిళలు పని ప్రదేశాల్లో ఎదుర్కొంటున్న వేధింపుల హింసను అరికట్టాలన్నారు. ఈ అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి విధానపరమైన మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పుష్పరాణి, మకాం జాతీయ నాయకురాలు ఉషాసీతా, సఖి సెంటర్ డైరెక్టర్ శివకుమారి, ఐసీడీసీ పల్లవి, తెలంగాణ జనసమితి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మీ, రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర నాయకులు కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దంతాల సంరక్షణపై అవగాహన


దంతాలను పరిశీలిస్తున్న వైద్యుడు

పటాన్‌చెరు టౌన్: హెల్ప్ ఏజ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ టెలి హెల్త్ ప్రాజెక్టులో భాగంగా గౌతంనగర్, క్యాసారం గ్రామంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్ప్ ఏజ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు ఇన్‌చార్జి సాంబరాజు మాట్లాడుతూ దంత వైద్య శిబిరంలో 100 మందికి ఉచితంగా దంత వైద్యం అందించినట్లు తెలిపారు. అనంతరం దంత వైద్యులు అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ రోజుకు రెండుసార్లు ఉదయం, రాత్రి దంతాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. భోజనం చేసిన తరువాత నీళ్లతో పుకిలించడం ద్వారా దంతాలను శుభ్రంగా ఉంచుకోవచ్చన్నారు. హెల్ప్ ఏజ్ ఇండియా నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దంత వైద్య శిబిరంలో గౌతంనగర్ కాలనీ వాసులు, క్యాసారం గ్రామస్తులు పాల్గొన్నారు.

పింఛన్ పత్రాలు అందజేత


పింఛన్ పత్రాలను అందజేస్తున్న విశాల్ అగర్వాల్

పటాన్‌చెరు టౌన్: హైదరాబాద్ కొండాపూర్‌లోని జయభేరి ఆటోమోటివ్స్ వర్క్‌షాప్‌లో నిర్వహించిన నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం 9మందికి పింఛన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పీఎఫ్ కమిషనర్ విశాల్‌అగర్వాల్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన నెలలోపు చందాదారులకు పింఛన్ పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రావు, మన్సూర్ బాషా, మురళి, రాజగోపాల్, వెంకటేష్, జయభేరి ఆటోమోటివ్స్ ప్రతినిధి నళిని, కాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 25 మందికి జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమ, మంగళవారా ల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 25 మందిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వాహనదారులను బుధవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి 25 మందికి ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకట్‌రెడ్డి

రాయికోడ్(అందోల్): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎస్ఐ వెంకట్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అల్లాపూర్ శివారులో ఉన్న సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం బాల్య వివాహాల నిషేధ చట్టం, బాలల హక్కులు, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చట్టాలపై విద్యార్థులు కనీస అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పెరుగుతున్న సాంకేతికతతో సైబర్ నేరగాళ్లు ఎంచుకుంటున్న మార్గాలు, పోక్సో చట్టం, బాలికల రక్షణ చట్టాలను వివరించారు. గుర్తుతెలియని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసుశాఖ సేవలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు.

కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించండి

సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు


మాట్లాడుతున్న జయరాజు

పటాన్‌చెరు టౌన్: కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు పిలుపునిచ్చారు. పటాన్‌చెరు పట్టణంలోని శ్రామిక భవన్‌లో బుధవారం సీపీఎం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. రాబోయే ఎంపీ ఎన్నికల్లో గెలవడం కోసమే ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారన్నారు. రామ జన్మభూమి పేరుతో ప్రజల్లో వైశ్యామ్యాలు పెంచుతున్నారని ఆరోపించారు. ప్రశ్నించే గొంతు నొక్కుతున్నారని, న్యూస్ క్లిక్ సంస్థ యాజమాన్యంను అరెస్ట్ చేయడాన్ని తప్పుపట్టారు. ఈడీ, సీబీఐ సంస్థలను కేంద్ర ప్రభుత్వం పావులుగా వాడుకుంటోందని ధ్వజమెత్తారు. కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాజయ్య, సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి వాజిద్‌అలీ, కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, పాండురంగారెడ్డి, రాజు, వెంకట్‌రామ్‌రెడ్డి, రామ చంద్రామూర్తి పాల్గొన్నారు.

జాతర ఆహ్వానపత్రిక ఆవిష్కరణ


ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం (పటాన్ చెరు): ఈ నెల 30 నుంచి ఎప్రిల్ 1వ తేదీ వరకు రామచంద్రాపురం పట్టణంలోని మందుములలో నిర్వహించనున్న భ్రమరాంబ మల్లికార్జునస్వామి జాతర ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్పొరేటర్ పుష్ప, మాజీ కార్పొరేటర్ అంజయ్యయాదవ్, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ


వివరాలను వెల్లడిస్తున్న అధికారులు

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని రైతువేదికలో జాతీయ ఉపాధిహామీ పథకం ఆడిటింగ్‌పై బుధవారం సామాజిక తనిఖీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ పీడీ బాల్‌రాజ్ సమక్షంలో డీఆర్‌పీలు తమ పరిశీలనలో వెలుగు చూసిన అవకతవకలను చదివి వినిపించారు. అనంతరం అడిషనల్ పీడీ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో 2022 మార్చి 1వ తేదీ నుంచి 2023 ఏప్రిల్ నెలాఖరు రూ.6.9 కోట్ల నిధుల ఖర్చుపై గ్రామాలవారీగా రూ.35వేల నిధులను రికవరీ చేయనున్నట్లు తెలిపారు. పలు గ్రామాల్లో తెలంగాణ క్రీడా ప్రాంగణాల కోసం వెచ్చించిన నిధుల్లో రూ.10 వేల వరకు తేడా ఉందని, బాధ్యులకు షోకాజు నోటీసుల జారీ, రికవరీపై నిర్ణయం తీసుకోనున్నట్లు వివరించారు. ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లకు సంబంధించిన రికార్డులు సమర్పించకపోవడం, పలు గ్రామాల ఉపాధిహామీ పనులకు సంబంధించిన రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో తనిఖీ బృందం, ఈజీఎస్ అధికారులు నాగేశ్వర్‌రావు, బోజిరెడ్డి, అంజాగౌడ్, రాజు, ఎంపీడీఓ షరీఫ్, ఎస్ఆర్‌పీ సురేందర్, ఏపీఓలు రమేష్, గురుపాదం, ఈసీ విష్ణు, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తాం

బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్


కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్

ఝరాసంగం(జహీరాబాద్): జహీరాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటవుతున్న నిమ్జ్ ద్వారా స్థానికులకు అత్యధిక ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తానని బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎల్గోయిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మరో మారు బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయినా హామీలను అమలు చేయడం లేదన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ విజయేందర్ రెడ్డి, నాయకులు సుభాష్ రావు, బస్వరాజ్, ఓం ప్రకాష్ పలువురు బీజేపీలో చేరారు. పాటిల్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎప్పటికప్పుడు రోడ్లను శుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో పారిశుధ్య పనులను చేయించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాలనీవాసులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ గాలికుంటు టీకాలు వేయించాలి

రాయికోడ్(అందోల్): పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. రాయికోడ్‌లోని పశువైద్యశాలలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది కృష్ణ, బసంతి, పోషకులు పాల్గొన్నారు.

◆ ఘనంగా అమరతిథి వేడుకలు

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మికక్షేత్రంగా బాసిల్లుతున్న బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో దత్తగిరి మహారాజు 45వ వార్షిక అమర తిథి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, డాక్టర్ సిద్ధేశ్వరస్వామి ఆధ్వర్యంలో జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాతృశ్రీ అనసూయ మాత, అర్చకుడు శివశంకర్ స్వామి, వైదిక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన పాదయాత్ర

దస్తగిరి మహారాజ్ వార్షిక అమరతిథిని పురస్కరించుకొని నారాయణఖేడ్ నియోజకవర్గంలోని బెల్లాపూర్ నుంచి చేపట్టిన పాదయాత్ర పల్లకీ సేవ మంగళవారం రాత్రి బర్దిపూర్‌లోని మహారాజ్ ఆశ్రమానికి చేరుకోవడంతో ముగిసింది. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన పాదయాత్ర పల్లకీ సేవ బృందానికి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు.

◆ తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించండి



కంది(సంగారెడ్డి): దాబాలు, ఫంక్షన్ హాల్స్ యజమానులు తడి, పొడి చెత్తను వేరుచేసి గ్రామ పంచాయతీ వాహనాల్లో వేయాలని ఎంపీఓ మహేందర్‌రెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో దాబాలు, ఫంక్షన్ హాల్స్ యజమానులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల పారిశుధ్య సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. దీంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సమావేశంలో కంది గ్రామపంచాయతీ ఈఓ విద్యాధర్‌గౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.


◆ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): మేడ్చల్ జిల్లా చెంగిచెర్లలో హోలీ ఉత్సవాలను జరుపుకుంటున్న హిందువులపై దాడి చేసిన ముస్లింలను శిక్షించాలని డిమాండ్ చేస్తూ హిందూ పరిరక్షణ సమితి మండల అధ్యక్షుడు ఆనంద్‌చారి ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్, ఎస్ఐకి వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో హిందూ పరిరక్షణ సమితి నాయకులు రవి, నర్సింహులు, వినోద్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, భార్గవ్ పాల్గొన్నారు.

◆ ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మద్నూర్ గ్రామంలో రెండు రోజులుగా కొనసాగిన వీరభద్రేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయం ఆవరణలో హోమం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాహకుల చర్యలు తీసుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

◆ పరామర్శ




జహీరాబాద్ టౌన్: మండల పరిధిలోని సత్వార్ మాజీ సర్పంచ్ మాణిక్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వీర్‌శెట్టి ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రుల్లో చేరి కోలుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాణిక్ రావు వారి నివాసాలకు వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట ఆ పార్టీ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, ఇప్పెపల్లి సొసైటీ చైర్మన్ మచ్చెందర్, నాయకులు మోహన్‌రెడ్డి, మిథున్‌రాజ్, అబ్దుల్ సాయిద్, బస్వరాజ్, లాలాప్ప ఉన్నారు.

డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు

పటాన్‌చెరు టౌన్: నిర్మాణాలు చేపట్టే వారిని బెదిరించి డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. అమీన్‌పూర్ పరిధిలోని పటేల్‌గూడ గ్రామపంచాయతీ పరిధిలో 15 రోజులుగా అనిరుద్ అనే వ్యక్తి సీసీఎల్ఏ నుంచి వచ్చానని, నిర్మాణాలపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఇటీవల పటేల్‌గూడ పరిధిలోని సృజనలక్ష్మీనగర్ కాలనీలో రెండు ఇళ్లను కూల్చివేయించాడు. ఈ క్రమంలో అనిరుద్‌పై అనుమానం వచ్చిన పటేల్‌గూడ గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్ బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా 384, 419, 447, 427 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం


శంకర్

పటాన్‌చెరు టౌన్: మార్కెట్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శంకర్ కుటుంబ సభ్యులతో కలిసి నెల రోజుల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్‌కు వచ్చి లాలాబాయి కాలనీలో ఉంటూ మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం మార్కెట్‌కు వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి అదృశ్యంపై కుమారుడు రాజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.